క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున డబ్బులతో ప్రయాణించే వారు వాటికి సంబంధించిన ఆధారాలు వెంటబెట్టుకోవాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. బుధవారం గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిసరాల్లోని 9 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ. లక్షా 5వేలను సీజ్ చేశామని తెలిపారు. తనిఖీల్లో గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ తిరుపతి, పోలీసు అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

బీఆర్ఎస్ ఓటమే లక్ష్యం

హుస్నాబాద్: బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా పని చేస్తామని సీపీఐ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ మంద పవన్ అన్నారు. బుధవారం పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ బలపరిచిన పొన్నం ప్రభాకర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈనెల 17న హుస్నాబాద్‌లో సీపీఐ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు మర్రి వెంకటస్వామి, కర్రె భిక్షపతి, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తపాల సేవలను సద్వినియోగం చేసుకోండి

మద్దూరు(హుస్నాబాద్): తపాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హన్మకొండ పోస్టల్ సూపరింటెండెంట్ హన్మంతు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు, ఇన్సూరెన్స్ పథకాలు, బాలికల భవిష్యత్ కోసం సంవత్సరానికి రూ. 400తో రూ. 10 లక్షల బీమా సదుపాయం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జనగామ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రమాదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించారు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ తెలంగాణ ఇస్తే కేసీఆర్ కుటుంబం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మండిపడ్డారు. బుధవారం చిన్నకోడూరులో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, పరశురామ్, జయంత్, గణేష్, స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఆ తీర్మానంతో మాకు సంబంధం లేదు'



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

ములుగు(గజ్వేల్): తామంతా ఏకగ్రీవంగా సీఎం కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశామనడం వాస్తవం కాదని కొండపోచమ్మ సాగర్ భూ నిర్వాసిత గ్రామమైన మామిడ్యాల ఆర్‌అండ్ఆర్ కాలనీకి చెందిన పలువురు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తీర్మానం చేసిన వారు బీఆర్ఎస్ కార్యకర్తలు అయి ఉండొచ్చని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, మాజీ ఎంపీపీ వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ్మల శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం బెజ్జంకిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నారోజు శంకరాచారి, ప్రధాన కార్యదర్శిగా రామంచ రవీందర్, ఆర్థిక కార్యదర్శిగా ఎండీ షాబుద్దీన్, ఉపాధ్యక్షుడిగా రాజమల్లు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అక్బర్‌పేటలో ఫ్లాగ్‌మార్చ్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని కూడవెల్లి, అక్బర్‌పేటలో బుధవారం కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కేసీఆర్ దూతగా వచ్చాను..



చేర్యాల మండలం కాశగుడిసెల్లో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పల్లాకు మద్దతు తెలుపుతున్న ఆకునూరు గౌడ కులస్తులు

- ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఈప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పంపితే దూతగా ఇక్కడికి వచ్చాను. మీరంతా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపూర్, కాశగుడిసెలు, ఆకునూరు, కొత్త దొమ్మాట, వీరన్నపేట, చుంచనకోట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ, చేర్యాల పట్టణ కేంద్రాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఎమ్మెల్సీ నిధుల నుంచి కొంత మొత్తాన్ని పలు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశానని తెలిపారు. ఇంకా కొన్ని నిధులు తెచ్చి ఈప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ప్రత్యర్థులు స్థానికత ప్రచారం మానుకొని సేవలో తనతో పోటీ పడాలని సవాల్ విసిరారు. తన ఆస్పత్రిలో జనగామ నియోజకవర్గ ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. అర్హులకు పథకాలు అందకపోతే ఎన్నికల అనంతరం తానే స్వయంగా పరిశీలించి ఇస్తానని చెప్పారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు పథకాల్లో అర్హులకు లబ్ధిచేకూరేలా చేస్తానన్నారు. గెలిచిన నెల రోజుల్లోపే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తూ జీఓ తెస్తానన్నారు. మా పథకాలు కేసీఆర్ కాపీ కొట్టాడని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు 50 ఏళ్ల పాలనలో ఎందుకు ప్రజలను పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రజల ఆర్థిక జీవన విధానాలు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని.. మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోస పోతే ఐదేళ్లు గోస పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, రాష్ట్ర నాయకుడు జల్లి సిద్దయ్య, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: చీటకోడూర్‌లో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న పల్లా నీలిమ



జనగామ: 26వ వార్డులో ప్రచారం చేస్తున్న జమున, నాయకులు

పల్లాకు అండగా నిలవాలి

జనగామ రూరల్: పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అండగా నిలవాలని ఆయన సతీమణి నీలిమ కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చీటకోడూర్, చౌడారం, మరిగడి గ్రామాల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు బొట్టు పెట్టి మంగళహారతులతో ఆమెకు స్వాగతం పలికారు. పల్లాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చీటకోడూర్ సర్పంచ్ కొత్త దీపక్‌రెడ్డి, ముక్క రాజయ్య, ఇట్టబోయిన రజిత శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి. ప్రేమలత రెడ్డి, ప్రశాంత్, ఉమాపతితోపాటు తదితరులు పాల్గొన్నారు. అలాగే పల్లా గెలుపునకు మండలంలోని మరిగడిలో బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, నిమ్మల స్వామి ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపునకు ఆయన తనయుడు పల్లా అనురాగ్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్‌తో కలిసి మండలకేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని కమాలయపల్లి, వల్లంపట్ల గ్రామాల్లో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు అయినాపూర్‌లో నాయకులు సార్ల కిష్టయ్య, మేర్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

26వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రచారం

జనగామ/బచ్చన్నపేట: జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ దూతగా జనగామకు వచ్చిన పల్లాను భారీ మెజార్టీతో గెలిపిస్తే, ఈ ప్రాంతం ఇతర జిల్లాల కంటే మెరుగ్గా అభివృద్ధి సాధిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మేనిఫెస్టోలో పొందుపరిచిన స్కీంలను ప్రజలకు వివరించారు. మూడో సారి కేసీఆర్‌ను సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బచ్చన్నపేట మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఆపింది కాంగ్రెస్ నాయకులే..

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: రైతులకు రుణమాఫీ చేసి అండగా నిలవాలని సీఎం కేసీఆర్ రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోనే కొందరి రైతులకు రుణమాఫీ జరగలేదని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లెలగడ్డ, వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, భల్లునాయక్‌తండా, పోతారం(ఎస్), నాగారం, ఉమ్మాపర్, మహ్మదాపూర్ గ్రామాల్లో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు గిరిజన తండాలు, శివారుపల్లెల అభివృద్ధిని విస్మరించాయని ఆరోపించారు. రైతులకు కరెంట్ సమస్యలు లేవని, భూ సమస్యలు సైతం పరిష్కరించి ప్రభుత్వ భూములకు పట్టాలు ఇప్పించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు స్వరూప, విజయలక్ష్మి, సాయిలు, రజిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్/సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల, దమ్మన్నగారి గూడెం, పొన్నాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో హరీశ్‌రావుకు మిగితా పార్టీల నుంచి పోటీ నామమాత్రంగానే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, తన్నీరు రేణుక శ్రీనివాస్, ఎంపీపీ సవితా ప్రవీణ్ రెడ్డి, ఎంపీటీసీలు బోనాల రంగం, మమత యాదగిరి, బీఆర్ఎస్ అర్బన్ మహిళా విభాగం అధ్యక్షురాలు కంది చంద్రకళ, బీఆర్ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షుడు ఎద్దు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు, చైతన్యపురి కాలనీల్లో 4వ వార్డు కౌన్సిలర్ కొండం కవిత మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గెస్ట్ లెక్చరర్లకు ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో డిగ్రీ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, బీసీ, ఓసీలు 55 శాతంతో పీజీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్ లేదా సెట్ పాసైన వారు, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18న ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

మంత్రి సమక్షంలో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి హరీశ్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దబోయిన గణేష్‌తో పాటు మరో 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ చుక్క శంకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సూకూరి లింగం, నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నంట బాపురెడ్డి, మాజీ సర్పంచ్ బుర్ర లింగంగౌడ్, మాజీ ఎంపీటీసీ సోమేశ్వర్‌రెడ్డి, భూపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా..



జనగామలో ప్రచారం చేస్తున్న కొమ్మూరి కోడలు దివ్య



జనగామలో బహిరంగ సభను తిలకిస్తున్న ప్రజలు

- కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: చేర్యాల, జనగామలో సొంత ఇళ్లు ఉన్నాయి.. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవాకం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే గృహలక్ష్మి స్కీంలో నెలకు రూ.2,500, రైతు భరోసా కింద ఏడాదికి రూ.15వేలు, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12వేలు, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, ఉన్నత విద్య కోసం రూ.5లక్షల బ్యాంకు గ్యారంటీ కార్డు, రూ.4వేల పింఛన్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇలా ప్రతీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, కొమ్మూరి



జనగామలో ప్రచారం చేస్తున్న సుధాకర్

కొమ్మూరితోనే జనగామ ప్రాంతం అభివృద్ధి..

కొమ్మూరి ఎమ్మెల్యేగా గెలిస్తే జనగామ ప్రాంతం రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతారని కొమ్మూరి కోడలు దివ్య అన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. దివ్య మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో కొమ్మూరి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, భవిష్యత్‌లో మరిన్ని చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు మంచి మనసుతో ఆశీర్వదించాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీ కార్డులతో పాటు స్థానికుడైన డైనమిక్ లీడర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అభివృద్ధి చేస్తాడని బలంగా నమ్ముతున్నారని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఓటింగ్ తేదీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు.

బావిలో పడిన ట్రాక్టర్.. తప్పిన ప్రమాదం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో దీపావళి రోజున ప్రమాదవశాత్తు చెప్పుల దుకాణం దగ్ధమైన సంఘటన తెలిసిందే. అయితే బుధవారం వ్యర్థాలను అక్బర్‌పేట పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో చెత్త డంపింగ్ యార్డులోకి తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పాడుబడిన బావిలో పడిపోయింది. అంతలోనే బావిలో అగ్నికీలలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌తో సహా బావిలో పడిన డ్రైవర్ మల్లేశం వెంటనే సర్పంచ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సర్పంచ్ భర్తతో పాటు మరికొందరు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ మల్లేశంను బావిలో నుంచి తాళ్ల సహాయంతో బయటకు లాగి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బావిలో మంటలు చెలరేగడంతో ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ప్రమాదంలో ట్రాక్టర్ టైర్లు పూర్తిగా కాలిపోయాయి.



బావిలో దగ్ధమవుతున్న ట్రాక్టర్

నేడు సర్వసభ్య సమావేశం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో హాజరుకావాలని సూచించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామతీర్థంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ గాలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లమ్మ కిష్టయ్య దంపతులకు ముగ్గురు సంతానం. 12 ఏళ్ల క్రితం ఎల్లయ్య మృతి చెందాడు. కిష్టమ్మ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండగా పెద్దకుమారుడు సుమన్(21) కూలీ పనులు చేసుకుంటూ తల్లికి సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె మంగళవారం మహిళా సంఘంలో రుణం డబ్బులు తీసుకుంది. ఈ విషయంలో సుమన్ తల్లితో గొడవపడగా, భయపడిన కిష్టమ్మ తన చెల్లి ఇంటికి నార్సింగి వెళ్లింది. ఇంట్లోనే ఉన్న సుమన్ ఉరి వేసుకొని మృతి చెందగా, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కిష్టమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ఆనంద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ బాబు, సీఏలు కల్పన, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహచారి, ఉపాధ్యాయులు రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ తల్లీబిడ్డకు ఉచిత వైద్యం

సిద్దిపేటఅర్బన్: బాలల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని సురభి వైద్య విజ్ఞాన సంస్థలో బుధవారం వెల్ బేబీ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ చైర్మన్ సురభి హరేందర్‌రావు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సుమారు 300 ఉచిత డెలివరీలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాంప్రసాద్, ఆస్పత్రి డీన్ రఫీ, ప్రిన్సిపాల్ రమణకుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ శివరామాచారి, అడిషనల్ సూపరింటెండెంట్ గోపీచంద్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని నర్సింహులపల్లె సర్పంచ్ కుసుంబ అంజమ్మ, వార్డు సభ్యురాలు పద్మ, బెజ్జంకి సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ తిప్పారపు మల్లేశం తదితరులు బుధవారం మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

◆ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటకమాన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రభుత్వ పెన్షనర్లకు అందజేస్తున్న వివిధ రకాల సౌకర్యాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బీఐ రీజినల్ మేనేజర్ అరుణ్‌జ్యోతి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

◆ దుబ్బాక ప్రజలు మార్పు కోరుతున్నారు

మిరుదొడ్డి(దుబ్బాక): అగ్రవర్ణ పాలనతో విసుగు చెందిన దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఓటుతో మార్పు కోరుకుంటున్నారని దుబ్బాక డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వెంకట ప్రసన్న అన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌లో ఓటుతో పాటు నోటు ఇవ్వాలని కోరుతూ బుధవారం వినూత్న ప్రచారం నిర్వహించారు.

◆ దూది శ్రీకాంత్ ఇంటింటి ప్రచారం

నంగునూరు(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ముండ్రాయి, రాజగోపాల్‌పేట, పాలమాకుల గ్రామాల్లో బీజేపీ సిద్దిపేట అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, తిరుపతిరెడ్డి, రమేశ్‌రెడ్డి, తిరుపతిరావు, కృష్ణ, శ్రీకాంత్, వెంకట్, యాదగిరి పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లోకి మద్దూరు సర్పంచ్

మద్దూరు(హుస్నాబాద్): జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరీ సభలో మద్దూరు సర్పంచ్ కంటారెడ్డి జనార్దన్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

◆ 'కవ్వంపెల్లి' ఎన్నికల ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రేగులపల్లె, పోతారం, నర్సింహులపల్లె, తిమ్మాయపల్లె, గుగ్గిల్ల గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

◆ ఒక్క అవకాశం ఇవ్వండి

సిద్దిపేటరూరల్: ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్న ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ అభ్యర్థించారు. బుధవారం రాంపూర్, రావురూకుల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.